# మునగనూరు.. ఇంజాపూర్‌లో ప్రభుత్వ భూములకు కబ్జా కాటు!

- రికార్డుల్లో సర్కారు భూములు.. నేలపై మాత్రం నిర్మాణాల జోరు!
- సైట్ విజిట్ లేకుండానే అనుమతులా? టౌన్‌ప్లానింగ్ తీరుపై తీవ్ర అనుమానాలు
- ఎమ్మెల్యే హెచ్చరికలు బేఖాతర్.. అధికారుల నిశ్శబ్దంపై స్థానికుల మండిపాటు



**దశ, రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. మునగనూరు, ఇంజాపూర్ ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములపై కొందరు కన్నేశారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టా భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమంగా ఆక్రమించి, వాటిని తమ భూముల్లో కలుపుకుంటున్నారన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అనంతరం అక్కడ హద్దులు మార్చడం, నిర్మాణాలు చేపట్టడం, ప్లాట్లుగా చూపించడం వంటి వ్యవహారాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు భవిష్యత్తులో పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సైట్ విజిట్ లేకుండానే ఇంటి నిర్మాణ అనుమతులా?

ఇప్పుడు అసలు ప్రశ్న ఇదే. ఒక స్థలానికి నిర్మాణ అనుమతి ఇచ్చే ముందు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారా? రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, హద్దులు, భూమి స్వరూపాన్ని పరిశీలించారా? ప్రభుత్వ భూమికి సంబంధించిన అంశాలను నిర్ధారించుకున్న తర్వాతే అనుమతులు మంజూరు చేశారా? స్థానికుల ఆరోపణలు నిజమైతే, ఈ ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగితాలపై ఉన్న రికార్డులు ఒకలా.. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితి మరోలా ఉంటే బాధ్యత ఎవరిది? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.

## సర్వే నంబర్లపై ప్రత్యేక దృష్టి

మునగనూరు పరిధిలోని సర్వే నంబర్లు 44/1, 38, 83తో పాటు ఇంజాపూర్ పరిధిలోని పలు భూములపై సమగ్ర పరిశీలన చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత సర్వే నంబర్లలో ఎంత భూమి ప్రభుత్వానికి చెందింది? ప్రస్తుతం ఆ భూమి ఎక్కడ ఉంది? భౌతిక హద్దులు ఎలా ఉన్నాయి? ఆక్రమణలు జరిగాయా? నిర్మాణాలు ఉన్నాయా? అనుమతులు ఎలా మంజూరయ్యాయి? అనే అంశాలను అధికారులు తేల్చాలని కోరుతున్నారు. ఒకసారి అధికారిక సర్వే నిర్వహించి రికార్డులు-భౌతిక హద్దులను సరిపోలిస్తే అసలు బాగోతం బయటపడుతుందని స్థానికులు చెబుతున్నారు.

## ప్రభుత్వ భూమికి కంచె ఎక్కడ?

ప్రభుత్వ భూములను రక్షించేందుకు హద్దులు నిర్ణయించడం, రక్షణ బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైతే ఫెన్సింగ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడ ఉన్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల హెచ్చరిక బోర్డులు పెట్టినా వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమిలో ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ప్రారంభ దశలోనే అడ్డుకోకపోతే.. తర్వాత కూల్చివేతలు, న్యాయపరమైన వివాదాలు అంటూ సమస్య మరింత జఠిలమవుతుందని స్థానికులు అంటున్నారు.

## ఆక్రమణదారులకు అండ ఎవరు?

ప్రభుత్వ భూములపై వరుసగా ఆరోపణలు వస్తున్నప్పటికీ చర్యలు ఎందుకు నెమ్మదిగా సాగుతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అధికార యంత్రాంగంపై రాజకీయ, ఇతర ఒత్తిళ్లు ఉన్నాయా? ఆక్రమణలకు ఎవరి అండ ఉంది? అనుమతుల ప్రక్రియలో ఎవరి పాత్ర ఉంది? అనే ప్రశ్నలు స్థానికుల్లో తలెత్తుతున్నాయి. అయితే ఇవి ప్రస్తుతం స్థానికుల ఆరోపణలు మాత్రమే. వాటిపై అధికారిక విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## 'మీడియా' పేరుతో సెటిల్‌మెంట్లా?

ఈ ప్రాంతాల్లో భూ వ్యవహారాల చుట్టూ కొందరు తమను తాము విలేకరులుగా పరిచయం చేసుకుంటూ జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన మీడియా ప్రతినిధులే భూ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వం చేస్తే అది మరింత ఆందోళనకర పరిణామమని స్థానికులు అంటున్నారు. నిజంగా ఎవరు విలేకరులు? ఎవరు భూవ్యవహారాల్లో మధ్యవర్తులు? అన్నది అధికారులు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే హెచ్చరించినా.. ఆగని ఆక్రమణలంటూ ఆరోపణలు

ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గతంలో హెచ్చరికలు చేసినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే సహించేది లేదని ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతుండటం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది.

## అధికారులు కదిలితేనే నిజాలు బయటకు!

మునగనూరు, ఇంజాపూర్ ప్రాంతాల్లో ప్రత్యేక రెవెన్యూ-టౌన్‌ప్లానింగ్ సంయుక్త సర్వే నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలించి ప్రభుత్వ భూమిని గుర్తించడంతో పాటు, అక్కడ జరిగిన నిర్మాణాలు, మంజూరైన అనుమతులు, భూమి హక్కుల పత్రాలను పూర్తిగా తనిఖీ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు తేలితే ఎంత పెద్ద వ్యక్తి అయినా వెనక్కి తగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మునగనూరు, ఇంజాపూర్‌లో ప్రభుత్వ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రికార్డులు బయటపెట్టాలి.. హద్దులు తేల్చాలి.. ఆక్రమణలు తొలగించాలి.. అక్రమ అనుమతులు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే నేడు ఎకరం.. రేపు మరో ఎకరం చొప్పున ప్రభుత్వ భూమి మాయమయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.



# పెంజర్లలో అభివృద్ధి, పారిశుద్ధ్య పనుల పరిశీలన



**దశ, రంగారెడ్డి :** కొత్తూరు మండలం పెంజర్ల గ్రామపంచాయతీలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి శనివారం పర్యటించి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణ, పెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్, ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, చిన్నారులకు పౌష్టికాహారం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**దశ, రామన్నపేట:** వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష ఎంతో మధురమైనదని, భాషావేత్తలు తెలుగు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారని అన్నారు. మాతృభాష పట్ల నిరాదరణ చూపకూడదని సూచించారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ.. గ్రాంథిక భాషలో రచనలు సామాన్య ప్రజలకు అర్థం కావడం కష్టమని, ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషలోనే రచనలు చేయాలని గిడుగు రామమూర్తి పంతులు ఉద్యమం చేపట్టారని తెలిపారు. తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి: ఏఐవైఎఫ్



**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దాల సాయికుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వార్షిక క్యాలెండర్ ప్రకటించాలని, పెండింగ్ నియామకాలను పూర్తి చేయాలని, జిల్లాల వారీగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కళ్లెం స్వామి, కార్యదర్శి రచ్చ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం



**దశ: రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగు రఘుమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రామన్నపేట మండలంలోని నూతనంగా నియమితులైన గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను అభినందించారు. యువజన కాంగ్రెస్ బలోపేతానికి నూతన కమిటీలు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుగుడు రవి యాదవ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పున్న అమరేందర్, నార్కెట్‌పల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జిల్లా పృథ్వీ, రామన్నపేట మండల ఉపాధ్యక్షుడు కందగట్ల రాహుల్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మేకల జలేందర్, కేస సందీప్‌తో పాటు వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేడిమిక్స్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

**దశ, రామన్నపేట:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్న రెడీమిక్స్ కంపెనీ నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామ వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. కంపెనీకి మంజూరైన అనుమతులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అనుమతులు రద్దు చేయడంతో పాటు జాతీయ రహదారి-65 వెంబడి జరుగుతున్న అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పంచాయతీ అధికారికి వార్డు సభ్యులు మర్రి హరీష్, జెల్లా ప్రశాంత్, ఏర్పుల మల్లీశ్వరి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంపెనీ అనుమతుల గురించి ప్రశ్నిస్తే టీఎస్-ఐపాస్ ద్వారా అనుమతులు తీసుకున్నట్లు అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులోనూ కంపెనీకి సంబంధించిన అనుమతులపై



ఎలాంటి సమాచారం కనిపించడం లేదన్నారు. పంట పొలాల మధ్య రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటుతో దుమ్ము, కాలుష్యం వెలువడి పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని, దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేసి కంపెనీ అనుమతులు, నిర్మాణ నిబంధనలను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# యువ క్రికెటర్లకు కార్పొరేట్ సంస్థలు అండగా నిలవాలి




❖ బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వరినాథ్

**దశ, హైదరాబాద్ :** దేశంలోని యువ క్రికెటర్లకు ఆర్థిక భరోసా, కెరీర్ భద్రత కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సహకరించాలని బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఆంధ్రా రంజీ కెప్టెన్ వి. చాముండేశ్వరినాథ్ పిలుపునిచ్చారు. బీసీసీఐ సహకారంతో నిర్వహించిన టీజీ 2026 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టుకు తాజ్ డెక్కన్ హోటల్‌లో ఘన సన్మానం నిర్వహించారు. 11 మ్యాచ్‌ల్లో 10 విజయాలు సాధించి టైటిల్ గెలుచుకున్న జట్టును టైటిల్ స్పాన్సర్ ట్రూజన్ సోలార్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరినాథ్ మాట్లాడుతూ.. యువ క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడంలో ట్రూజన్ సోలార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హైదరాబాద్ జట్టుకు మరో మూడేళ్ల పాటు స్పాన్సర్‌షిప్ కొనసాగించనున్నట్లు తెలిపారు.

**ప్రతిభావంతులకు అండగా ఉంటాం: ట్రూజన్ సోలార్ ఎండీ ట్రూజన్ సోలార్**

ఎండీ చారుగుండ్ల భవాని సురేష్ మాట్లాడుతూ.. ఆటగాళ్లను అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి ఆర్థిక, మౌలిక సహాయం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రూజన్ సోలార్ సీఈఓ జక్కుల శ్రీనివాస్, హైదరాబాద్ ఈఛాంపియన్స్ కెప్టెన్ అభిజిత్ రెడ్డి, వైస్ కెప్టెన్ అజయ్ దేవ్ గౌడ్, జట్టు సభ్యులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభలో పదవులు పొందిన నాయకులను సన్మానించిన కలకోట లక్ష్మయ్య



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట ఆర్యవైశ్య నాయకులు కలకోట లక్ష్మయ్య ఆద్వర్యంలో ఇటీవల రాష్ట్ర కార్యవర్గంలో నూతనంగా పదవులు పొందిన పొలిటికల్ వైస్ చైర్మన్ వెంపటి సురేష్, ప్రచార సమితి వైస్ చైర్మన్ తప్పి గాంధీ, యువజన విభాగం ఉపాధ్యక్షులు వెంపటి శబరినాథ్, పొలిటికల్ కార్యదర్శి దేవరశెట్టి సత్యనారాయణ లను శాలువాలతో సన్మానించారు. శనివారం సాయంత్రం బ్లూసి సెంటర్ లో జరిగిన కార్యక్రమం లో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఐకమత్యంగా కలిసిమెలిసి పని చేయాలని అన్నారు. సూర్యాపేటలో ఆర్యవైశ్యులు పలు వార్డుల్లో మెజార్టీ సంఖ్యలో ఉన్నప్పటికీ కౌన్సిలర్ లుగా విజయం సాధించలేకపోతున్నారని, ఇందుకు కారణము సరైన ప్రణాళిక లేకపోవడం, ఐకమత్యం లేకపోవడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలకోట లక్ష్మయ్య, పోతుగంటి వెంకటేశ్వర్లు, వెంపటి పురుషోత్తం, కుక్కడపు శ్రీనివాస్, చల్లా సత్యనారాయణ(కిరాణం), బూర్లే రామ్మూర్తి, గొడిశాల శంకర్, కొండా శ్రీనివాసరావు,బెలిదె శ్రీను(బంకు), శ్రీరంగం రాము, బ్రాహ్మణపల్లి సంతోష్, బెజగం ఫణి, కాసం రమేష్, పాలవరపు శ్రీశైలం,సోమ ఉపేందర్, తల్లాడ వెంకటేశ్వర్లు, కొత్త వెంకన్న, తేరటిపల్లి సతీష్, కందిబండ ఉమా మహేశ్వరరావు, గుండా రమేష్, ముకుందం, చల్లా సత్యనారాయణ, పబ్బతి వేణుమాధవ్, పబ్బతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 317 బాధితులకు న్యాయం జరగకపోతే నిరాహార దీక్ష

***జీవో 317 ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ సెక్రటరీ జనరల్ నాగేశ్వరరావు***



**దశ, ఓయూ:** ఎన్నికల సమయంలో జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని జీవో 317 ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ సెక్రటరీ జనరల్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం జరగకపోతే సెప్టెంబర్ లో ఇందిరాపార్క్ వేదికగా నిరాహార దీక్ష, అక్టోబర్ లో చలో గాంధీభవన్ చేపడుతామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం జేఏసీ కార్యాలయం నుండి ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. జీవో నెంబర్ 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసు అని వారిని వారి సొంత జిల్లా, జోన్లకు కేటాయిస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి నేటికీ అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇచ్చిన హామీ ని నిలబెట్టుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంపై పలుమార్లు నిరసనలు ధర్నాలు చేశామని ముఖ్యమంత్రి మంత్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కార మార్గం చూపకపోవడం విచారకరమన్నారు . జీవో నెంబర్ 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులందరూ సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు.

## పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని 34వ వార్డులో దాస్యం అనూష ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ లు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూతన గృహంలో గృహప్రవేశం చేస్తున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గవర్నర్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



**దశ, ఓయూ:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య శనివారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందిన గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య చికిత్స వివరాలను తెలుసుకుని త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. గవర్నర్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని రాష్ట్ర ప్రజలకు మరింత సేవలందించాలని మల్క కొమరయ్య ఆకాంక్షించారు. భగవంతుడి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని కోరుకున్నట్లు తెలిపారు.

## నరసింహ మృతికి కొత్తింటి కుటుంబం సంతాపం





**దశ, ఓయూ:** అనుబంధాలతో చిరునవ్వులు చిందిస్తూ, ఆప్యాయమైన పలకరింపులతో అందరినీ ఆదరించే జన శంఖారావం పార్టీ అధినేత పర్దిపురం నరసింహ మృతి పట్ల కొత్తింటి కుటుంబం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతి తమ కుటుంబానికి తీరని లోటని పేర్కొంది. ఈ విషాద సమయంలో నరసింహ కుటుంబ సభ్యులకు కొత్తింటి కుటుంబం ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఘన నివాళులు అర్పించింది.

## రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో చోరీ



❖ *హుండీని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని దుండగుడు*

**దశ, ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలోని ప్రముఖ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. స్థానికులు, ఆలయ వర్గాల సమాచారం ప్రకారం.. ఓ వ్యక్తి బైక్‌పై ఆలయానికి వచ్చి, ఎవరూ లేని సమయం చూసుకుని హుండీని అపహరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారికి హుండీ కనిపించకపోవడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరాల పుటేజీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయంలో చోరీ జరగడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి గట్టి భద్రత ఏర్పాటు చేయాలని వారు పోలీసులను, ఆలయ కమిటీని కోరుతున్నారు.

## బుల్లెట్ రైలు దీక్షలకు మద్దతు పలికిన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ సాధన కోసం రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా 16 రోజుల ప్రగతిశీల మహిళా సంఘం జరుపుతున్న నిరాహార దీక్షలకు మద్దతుగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు కర్నాటి కిషన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ లు మాట్లాడుతూ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. సూర్యాపేటకు మొదట చేసిన అలైన్మెంట్ ప్రకారం బుల్లెట్ రైలు రావాల్సి ఉండగా ప్రాముఖ్యతనులేని కొండమల్లేపల్లి హాలియా సాగర్ మీదుగా మార్చడం జరిగిందని అన్నారు. మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ ను హైదరాబాద్ సూర్యాపేట అమరావతి మీదుగా చెన్నైకి నడపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య సంఘం ఉపాధ్యక్షులు గుండా శ్రీధర్, మిట్టపల్లి రమేష్, సోమ వెంకటేశ్వర్లు, కోశాధికారి ఉప్పల శ్రవణ్ కుమార్, సోమ ప్రవీణ్, డోగుపర్తి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్–పీజీ పరీక్షకు పటిష్ఠ బందోబస్తు

***ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల అమలు***



**దశ, హైదరాబాద్:** నీట్-పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (NBEMS) ఆధ్వర్యంలో ఆదివారం (ఆగస్టు 30) పరీక్ష జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ తెలిపారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS)-2023లోని సెక్షన్ 163 కింద ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ప్రజలు గుమిగూడడం, సమావేశాలు నిర్వహించడం, ఇతర కార్యకలాపాలు చేపట్టడం నిషేధం విధించినట్లు తెలిపారు. అయితే విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది, సైనిక సిబ్బంది, హోంగార్డులకు ఈ నిషేధాజ్ఞల నుంచి మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు...




**దశ, ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే 2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మంగు మాట్లాడుతూ ఈ ఏడాది రికార్డు స్థాయిలో 31 గోల్డ్ మెడల్స్, 88 క్యాష్ అవార్డులు ప్రదానం చేశారు. వేడుకలో సుమారు 1,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.

## ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

❖ *రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి*

❖ *పాల్గొన్న కలెక్టర్ రాహుల్ శర్మ*



**దశ, భూపాలపల్లి:** హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీని వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నోటీసులు అందజేసిన రోజు నుంచి ఏడు రోజుల్లోగా ఫిర్యాదులు, అభ్యంతరాలపై విచారణ పూర్తి చేయాలని, సంబంధిత రికార్డుల పరిశీలనను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్ల జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందజేసి, క్లెయిమ్స్, అభ్యంతరాల సమయంలో సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలపై రోజువారీ నివేదికలు పంపాలని, మొత్తం ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, ఏఈఆర్ఓలకు శిక్షణ ఇచ్చి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో 11,739 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు, 20,685 మంది అనామలీస్ ఓటర్లు కలిపి మొత్తం 32,424 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతి మండలంలో ఎంపీడీఓలను, మున్సిపల్ కమిషనర్‌ను అదనపు ఏఈఆర్ఓలుగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో విచారణకు హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలు సమర్పించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీటీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.